# అలజడి ...

- హిమబిందు. ఎస్

"బిడ్డని కనడానికి అద్దె వసూలు చేయడం, లేదా ఓ ఒప్పందం ప్రకారం ఒప్పుకున్న పనికి నెలకి ఇంతని సొమ్ము పుచ్చుకోవడాన్ని సంపాదనగానే చూడాలి ... ఇటువంటి సొమ్ముకి ఆదాయపు పన్నులో మినహాయింపు ఇవ్వాలని ఎక్కడా రాసి లేదు .... నా అభిప్రాయంలో ... ఇది రిపోర్ట్ చెయ్యాల్సిన ఆదాయం!" ఈ మాటలు వినగానే...

.... ఏం... ఎందుకు లెక్క చెప్పాలి ? ... నా శరీరం మీద కూడా నాకు హక్కు లేదా?! .... రకరకాల ఖర్చుల పేర్లు చెప్పి ... సరోగసీ ఏజన్సీలు పేరెంట్స్ నుంచి డెభ్బయి, ఎనభై వేల డాలర్లకు పైగా వసూలు చేస్తుంటే... మిలియన్ల వ్యాపారం జరుగుతుంటే, అండగా నిలబడుతున్నవి గవర్నమెంటులే ... ఆ లెక్కలు ఏనాడూ బయటకి రావు. ఈ శరీరాన్ని అడ్డు పెట్టుకుని గవర్నమెంటు ఎంత సంపాదించాలనుకుంటోంది? ...

ఆవేశంగా మాట్లాడుతున్న కేట్ ని అడ్డుకుంటూ,

సరొగసీ ఏజన్సీ మీకు ఎటువంటి టాక్స్ ఫాం ఇవ్వలేదు కాబట్టి, ఆదాయపు పన్ను కట్టవలసిన అవసరం లేదని చెప్పడం తప్పు త్రోవ పట్టించడమే అవుతుంది. అలాగే ... ఆదాయపు పన్ను శాఖ (Internal Revenue Service ) తప్పకుండా మిమ్మల్ని వెతుక్కుంటూ వొచ్చి, వడ్డీ తో సహా ఆదాయపు పన్ను కట్టమంటుందనీ చెప్పలేను....అదో మహా సముద్రం... కొత్తగా రూపు దిద్దుకుంటున్న "వృత్తి" కనుక మీరు చెప్పే విషయాల మీద కొంత అస్పష్టత ఉంది.

పైగా అన్ని ఏజన్సీలు ఒకే మాదిరి ఒప్పందాలని కుదుర్చుకోవు ... రక రకాల పదాలు వాడుతుంటారు... ..మీరు ఏం ఆశించి ఈ పని చేస్తున్నారనేది ఇక్కడ కీలకమైన అంశం ... ఇక మీ మాజీ భర్త నుంచి భరణం వస్తుంటే అది కూడా తప్పకుండా రిపోర్ట్ చెయ్యాల్సిన ఆదాయం.

www.sirimalle.com

నా మాటల్ని మీరు తప్పుగా అనుకోకండి, చట్టాల తాత్పర్యం ఎలా ఉంటుందో చెప్పడం కోసమే ఆలా అన్నాను. రక్త దానం చెయ్యటం గొప్ప విషయం, కానీ అదే జీవనాధారం అయిందనుకోండి...అమెరికాలో స్వయం ఉపాధి (self-employment)! ఈ మధ్య కాలంలో తల్లి పాలు అమ్ముతున్న మహిళలు ఎంతో మంది ఉంటున్నారు, ఈ పని కూడా స్వయం ఉపాధి కింద పరిగణించాల్సి వొస్తోంది. ఆదాయానికి సంబంధించిన అన్ని కాగితాలూ, ఖర్చుల వివరాలూ తీసుకొస్తే, పన్ను ఎంతో లెక్క కట్టొచ్చు... మీరు విద్యార్థిని అంటున్నారు కనుక టాక్స్ ఫైల్ చెయ్యడం ఉపయోగం కూడా... లేనిపోని తలనెప్పులు ఉండవు... వివరణ ఇచ్చాడు సిపిఎ (Certified Public Accountant).

ఒక్క నిమిషం గట్టిగా ఊపిరి పీల్చి వొదిలి,

"వాటెవర్!? నా వరకు...సంతానం లేని తల్లిదండ్రులకి నేను ఆనందం పంచబోతున్నాను. వాళ్ల బిడ్డని నేను కడుపులో పెట్టుకుని కాపాడుతున్నాను.....నేనో అమ్మను...

మీరు చెప్పినట్టు ఒక వేళ ఉద్యోగమే అనుకుందాం... ఇదేదో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల దాకా చేసే పని కాదే, ఇరవై నాలుగు గంటలు డ్యూటీలో ఉన్నట్టే . నెలకి సుమారు రెండూ వేల డాలర్లు ఇస్తే, నేను దాదాపు 700 గంటలు పైన పని చేస్తున్నట్టు ! ఈ లెక్కన నాకు గంటకి మూడు డాలర్లు కూడా రావడం లేదు. కాలిఫోర్నియాలో గంటకి కనీస వేతనం ఎంత?! ఆదాయం వస్తోంది కనుక ఇది వృత్తి, పన్ను కట్టండి అనటం అన్యాయం.... సరొగసీ ఏజన్సీ కూడా, మేమిచ్చే డబ్బు మీద పన్ను చెల్లించాల్సి ఉంటుందని వివరంగా చెప్పిన గుర్తు లేదు... ఇలా ఎందుకు జరిగిందని ఏజన్సీ ని ఎవరు ప్రశ్నిస్తారు ?

ఇవన్నీ ఏవరితో చెప్పుకోవాలి? !

అచ్చం మీరిందాక వర్ణించినట్టుగానే ... ఈ బిడ్డని కంటున్నందుకు, ఎన్ని రకాల మాటలు ... ? అవన్నీ ఎంత వేదనకు గురి చేస్తాయో చెప్పలేను... కానీ ఇంటికి వెళ్ళి ఓ గ్లాస్ వైన్ తాగి రిలాక్స్ కాలేను... బిడ్డ కడుపులో ఉన్న విషయం ఎలా మర్చిపోతాను?! తోడుండాలని ఎవరికి అనిపించదు..... నా పరిస్థితికి , బాయ్ ఫ్రండ్ ని వెతుక్కోవటం అనే అలోచన కూడా భయానకమే... మామూలుగా ఉద్యోగాలు చేసే వాళ్లకి ...ఇలాంటివన్నీ ఉంటాయా ? !

ఏది ఏమయితేనేం... నేనేదో రెంటల్ బిజినెస్ చేస్తున్నట్టు పన్ను కట్టాలంటే మాత్రం కడుపు మండుతోంది. ఈ పని చెయ్యడం వల్ల శరీరం అరిగిపోయిందని సగం డబ్బులు ఖర్చుల కింద తీసేయ్యొచ్చా ?! మాజీ భర్త భరణం ఇస్తే, అదీ ఆదాయంగా చూపాలంటున్నారు... మరి అటార్నీకి పెట్టిన డబ్బు ఇతర ఖర్చుల కింద తీసెయొచ్చా ? !

ఒక వేళ ఆదాయపు పన్ను శాఖ (Internal Revenue Service ) నన్ను వెతుక్కుంటూ వచ్చినా , ఏం ఉందని పీక్కుపోతారు .....

ఇలా... ప్రశ్నిస్తున్న కేట్,

మధ్యలో ఆగిపోయింది....

ఈ రోజు మీతో టాక్స్ ఫామ్స్ తయారు చేయించుకుంటే అందుకు డబ్బులు చెల్లించే స్థితిలో కూడా లేనని,

వెనక్కి చూడకుండా , అక్కడి నుంచి బయలుదేరింది.

డ్రయివ్ చేస్తోంది కానీ మనసంతా చికాకు గా ఉంది. తన జీవితాన్ని కమ్ముకొని ఉన్న ముసురు ఎప్పటికి తెరిపినిచ్చేను ... అని మదనపడుతుండగానే...

కేలన్ స్కూలు దగ్గరకి చేరుకుంది!

అమ్మని చూసిన ఆనందంలో మొహం అంతా విప్పార్చుకుని, గబగబా వొచ్చి చుట్టేసుకున్న కొడుకుని చూసిన క్షణం... తెరిపినిచ్చిన ఆకాశం.

“ma-ma ! బేబీ కిక్ చేస్తోందా ?!” కడుపుని ప్రేమగా తడుముతూ అడిగిన తన ఐదేళ్ల కొడుక్కి “నో ... సన్ షైన్ (Sun Shine!) ...ఈ సారి కిక్ చేసినప్పుడు నీకు తప్పకుండా చూపిస్తాగా ...

అనేక కబుర్ల మధ్య ఇంటిదారి పట్టారు......

కడుపులో ఉన్న బిడ్డని గురించి కేలన్ అడిగినప్పుడల్లా,

"డాడా (Da-Da) తో కొట్లాడి నన్ను నీ దగ్గరే పెట్టుకున్నావే, అలా ఈ బేబీ పేరెంట్స్ తో కూడా చెయ్యి! మనం అందరం హాపీగా ఉండొచ్చు. బేబీ ని చూసుకోవడంలో నేను కూడా సహాయం చేస్తాను " అన్న పసి మాటలు గుర్తుకు రాకుండా మానవు.

ఓ బిడ్డకి జన్మనివ్వబోతున్నానని కేలన్ తో అన్నప్పుడు తను ఆనందంతో గంతులు వేయటం కేట్ ని అప్రమత్తం చేసింది. అందుకే ... తానో సరోగేట్ మదర్ అని, పుట్టిన బిడ్డని తల్లిదండ్రులకి ఇచ్చేయ్యాలనేది ఈ బాధ్యతలో ముఖ్యమైన విషయం అని నొక్కి చెప్పినపుడు కేలన్ స్పందన అది.

బిడ్డ పుట్టిన తరువాత ఉండే హక్కుల్ని వొదులుకోవడానికి ఎలా ఒప్పుకుందో, అదే నిర్మోహం కేలన్ లోను నింపాలి... తమతో అనుబంధం ఉండబోని ఓ జీవితో, ఎటువంటి భావోద్వేగానికి లోనుకాకుండా, అనురాగం పెంచుకోకుండా కొన్ని నెలలు కలిసి జీవించాలి... సాధ్యమేనా ... ?! డబ్బుల కోసం బిడ్డని ఇచ్చేసిన తల్లిగా పసి వాడి మనసులో ముద్ర పడుతుందా?! అది తట్టుకోగలనా ...పదే పదే ప్రశ్నించుకుంది... కానీ తప్పదు!

కేలన్ అలా అడిగిన రాత్రి, తన పక్కన పడుకుని, తల నిమురుతూ...

"ఫ్రాన్స్ అనే ఒకానొక దేశంలో జాన్ , నాన్సీ అనే జంట ఉన్నారు. వాళ్ళకి పిల్లలంటే చాలా ప్రేమ. తాము కూడా పేరెంట్స్ అయితే ఎంత బాగుంటుంది అని కలలు కన్నారు. అయితే నాన్సీ పొట్ట లో "ఆవీ "(పిల్లల భాషలో గాయం) ఉంది. దాంతో వాళ్ళ బేబీని "tummy ma-ma" పొట్టలో ఉంచొచ్చని డాక్టర్లు చెప్పారు. కానీ ఇక్కడో పెద్ద చిక్కున్నది, వేరే వాళ్ళ బేబీని పొట్టలో పెట్టుకోకూడదనేది ఆ దేశంలో ఉన్న చట్టం! జాన్, నాన్సీ లు బాగా ఆలోచించి, ఖర్చయినా పరవాలేదని... ఫ్రాన్స్ నుంచి అమెరికా వొచ్చారు. అమెరికాలో కూడా కేవలం ఆరు రాష్ట్రాలు మాత్రమే ఈ పద్దతికి ఒప్పుకుంటాయి, నిబంధనలు అన్నీ చూసుకుని, కాలిఫోర్నియా బాగుందనుకున్నారు. కాలిఫోర్నియాలో కేలన్, వాళ్ళ ma-ma వున్నారు అని తెలుసుకుని చాలా సంతోషంగా ...

“కేలన్ వాళ్ళ ma-ma ... కేలన్ వాళ్ళ ma-ma మాకు సహాయం చెయ్యవా” అని అడిగారు. నీకు తెలుసు కదా ma-ma లకి బేబీలంటే ఎంత ఇష్టమో! పైగా జాన్, నాన్సీ లను చూస్తే చాలా మంచి వాళ్ళుగా అనిపించారు... వాళ్ళు ఎంతో స్నేహంగా, దయగా కూడా ఉన్నారు. వాళ్ళకి సహాయం చేయ్యాలనిపించి, “tummy ma-ma” గా ఉంటాను అని ఒప్పేసుకుంది. ma-ma కయితే కేలన్ ఉన్నాడు... ఆడతాడు, పాడతాడు, బోలెడంత ప్రేమిస్తాడు, ఇవన్నీ వాళ్ళతో ఎవరు చేస్తారు!? ఇపుడీ బేబీని వాళ్ళకి ఇవ్వకపోతే పాపం జాన్, నాన్సీ ఎంత బాధపడతారు?! బేబీని వాళ్ళకి ఇస్తే వాళ్ళు ఎప్పటికీ సంతోషంగా ఉంటారు....They will be happy ever after.....

కధ ముగించబోతే....

“జాన్, నాన్సీ లు కేలన్ వాళ్ళ ma-ma.. దగ్గరకే ఎందుకొచ్చారు? “నిద్ర కప్పేస్తున్న కళ్ళతో ఓ ప్రశ్న.

మంచి ప్రశ్న ...... మన వంశ క్రమంలో ఓ పావు భాగం ఫ్రెంచ్, మరో పావు భాగం ఇంగ్లీష్, ఇంకో అర్ధ భాగం అమెరికన్ వారసత్వం, పద్దతులూ ఉన్నాయంటూ అమ్మమ్మ కధలు చెపుతుంటుంది ... గుర్తు లేదూ.. ఆ వివరాలని పేరెంట్స్ కావడానికి సాయం చేసే ఏజన్సీకి ఇచ్చినపుడు ... జాన్, నాన్సీ లు ఆసక్తి చూపించారు. అందులోనూ... కేలన్ లాంటి మంచి అబ్బాయి, బాగా సహాయం చెయ్యడమే కాకుండా వాళ్ళ బేబీ ని సురక్షితంగా అందిస్తాడనే నమ్మకంతో కేలన్ వాళ్ళ ma-ma దగ్గరకి వొచ్చారు.“

ఆశగా కొడుకు వంక చూసింది ... నిద్రలోకి జారుతూ కనిపించాడు కేలన్.

కధ చెప్పిన కేట్ కి కన్నీరే ఒదార్పు !

ఇది అంత సులభమయింది కాదు హనీ... తల్లి మాటలు గుర్తుకొచ్చాయి.

“చదువు లేదు, ఉద్యోగం లేదు, డబ్బు లేదు... ఇకనైనా నా కాళ్ళ మీద నేను నిలబడాలంటే మధ్యలో ఆపేసిన చదువుని పూర్తి చెయ్యాలి. ఏ స్టోరు లోనో పని చేసినా, ఆ డబ్బు కేలన్ డే కేర్ కి కూడా సరిపోదు, చదువుకునే ఓపిక మిగలదు... తండ్రికి దూరమైన కేలన్ తో ఎక్కువ సమయం గడపాల్సిన అవసరమూ ఉంది. నీతోనే ఉంటున్నాం, డైవోర్సు విషయంలో అటార్నీ ఖర్చులకి ఇప్పటికే కొంత సాయం చేశావు ...

మిగతాది నేను పెట్టుకోక తప్పదు. ఇంకా, ఇద్దరి పోషణ, ఇతర ఖర్చుల భారం కూడా నీ మీద వెయ్యలేను, చదువుకు అయ్యే ఖర్చులు నీకు తెలియనివి కావు. ఏదైనా లోన్ తీసుకుందామన్నా, నాకు సరైన క్రెడిట్ స్కోరు లేదు...స్పాన్సరింగ్ కష్టం. ఓ సంవత్సరం పాటు మెడికల్ ఇన్సూరెన్స్ వాళ్ళే కడతామంటున్నారు... "

సులభంగా తల్లిని సమాధానపరిచింది కానీ,

బిడ్డతో జన్యుపరంగా సంబంధం కలిగి ఉండటమా, తల్లిదండ్రులే డోనర్లుగా ఉంటే పోస్ట్ చెయ్యటమా?! Selective reduction ... అవసరమైతే అబార్షన్ కి సరే అనటమా లేదా ..... ఎన్నో కఠిన ప్రశ్నలు ... వాటితో చేసిన లోపలి యుద్ధాలు ...!

ప్రెగ్నెన్సీ హార్మోనుల అసంపూర్ణ ఆరోహణ, అవరోహణలు ...

నెలలు గడుస్తున్న బాధ్యత !

నిద్ర పట్టడంలేదు!

కడుపులోని చిట్టి పాదాలు కదులుతుంటే, బుజ్జగిస్తున్నట్టుగా తడుముతూ ఇంకెన్ని వారాలో లెక్కపెట్టుకుంది ...

ఎప్పుడెప్పుడు ఇక్కడకు వాలిపోయి, బిడ్డని గుండెకి హత్తుకోవాలని ఆతృత పడుతున్న జాన్, నాన్సీ లు గుర్తొచ్చారు. ఈ జన్మకి మరిచిపోలేని సహాయం చేస్తున్నావు... ఈ బంధాన్ని ఇంతటితో ముగించమనే వారి అంతరంగం మనసుకి ఊరటనిస్తోంది.

కేలన్ నిద్ర పోతున్నాడు... ఏ సమయంలో బేబీ కిక్ చేస్తోందో గమనించాలి....వాడి సరదా తీర్చాలి... వద్దనుకుంటూనే ఆపేక్ష రేపుతున్నానా...? ఎంత పుట్టకపోయినా ప్రాణమున్న జీవి కదా .... పట్టనట్టు ఉండాలని ఎలా చెప్పను...?! ...సమర్థించుకుంది.

ఇంతలోనే....

వొచ్చే డబ్బులు ఆగిపోతే...?!

www.sirimalle.com

చదువు ఇంకా పూర్తి కాలేదు, కేలన్ చిన్నవాడు ....అదాయపు పన్ను శాఖ (Internal Revenue Service) నన్నొదలక పోతే... ఎక్కడి నుంచి తెచ్చి కడతాను ?!

బిడ్డ పుట్టిన తరువాత కోలుకునేందుకు ఇచ్చే పరిహారంతో కొద్ది నెలలు గడిపినా ... మళ్ళీ మొదటికే...

మరో సారి, ఇలా బిడ్డని కనేందుకు సిద్ధమేనా..?!

శరీరాన్ని, మనసుని, బిడ్డని ఇంత కష్ట పెట్టుకోవాలా...

ప్రత్యామ్నాయం ?! ... అంతా అలజడి...

.... అనుభవాన్ని బట్టి చెల్లింపుట!

ఎన్ని సార్లు ..?!

కొత్త కథ చెప్పలేను... ఎదిగే వయసు...... పిల్లలు లేని వాళ్ళకి సాయం చెయ్యడం కోసం ఓ రోజు నన్నూ అలా ఇచ్చేస్తావా ? అనడిగితే...

ఎప్పటికీ......, ఎవరికీ.... తనని ఇవ్వను అని ఎలా నమ్మకం కలిగించను?!

ఎలా గడుస్తుంది...?????????

... సరొగేట్ సపోర్ట్ గ్రూప్ లేదా కమ్యూనిటీ గ్రూప్ ఉందేమో వెతకాలి ......

... కష్టం, నష్టం, అవసరమూ అంతా నాదే...

ఈ పద్ధతిలో ఎన్ని "బ్రహ్మ" రహస్యాలు ఉన్నా, ఎవరికి ఎక్కువ లాభం ఉన్నా ... సిద్ధంగా వేసి ఉంచిన మార్గం...

అటువైపు నుంచి, నువ్వేంతో గొప్ప అమ్మవన్నారు... ఆచ్చం వాణిజ్య ప్రకటనల్లో (అడ్వర్టయిజ్మెంట్లలో) లాగా... సరికొత్త నిర్వచనానివన్నారు. అరుదైన సేవ చేస్తున్నారన్నారు .... రెండు మూడు సార్లు ఇలా

www.sirimalle.com

బిడ్డలని కన్న తల్లుల ఫొటోలు పెట్టి రాసిన చక్కటి కథలు .......!  చిరునవ్వులు చిందిస్తూ కుటుంబాలు... అంతా ప్రొఫెషనల్...

సమాజ సేవ అనే భ్రమ నాకెందుకు ?!

ఆలోచనలని కప్పేస్తూ ... "This girl is on fire.........." అలీసియా కీస్ పాట హమ్ చేయడం మెదలుపెట్టింది...

అసహనంగా కదులుతున్న బిడ్డ...... అంతరాంతరాల్లో ...  ఇంకా తెగిపడని ...... బొడ్డు పేగు!